క్లుప్తంగా

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి



హరిపురంలో సంక్షేమం, అభివృద్ధి ఫ్లెక్సీ ఆవిష్కరణ

రాంబిల్లి : జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ అన్నారు. హరిపురంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి చేసిన జగనన్నకు అండగా నిలవాలన్నారు. జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ రమణమూర్తిరాజు(శ్రీనుబాబు) మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో కేవలం ఆయా పార్టీ వారికే సంక్షేమ పథకాలు అందేవని, అయితే జగనన్న ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని అన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేస్తే పథకాలు కొనసాగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ, సంక్షేమం, అభివృద్ధి డేటా ఫ్లెక్సీ ఆవిష్కరణ చేశారు. వైస్ ఎంపీపీ నర్సింగరావు, సర్పంచ్‌లు దేవుడమ్మ, తాతబ్బాయి, సచివాలయ కన్వీనర్ అప్పారావు(బుజ్జి) అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

మునగపాక: మండల కేంద్రంలో గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం బుధవారం సాయంత్రం జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మునగపాక మెయిన్‌రోడ్డు నుంచి గౌరీ పరమేశ్వరులను ఊరేగింపుగా గ్రామంలోని అన్ని వీధుల గుండా తీసుకువస్తామన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిలుపు మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ సమావేశం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఎస్‌కేఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం టీడీపీ-జనసేన నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ పార్టీలకు చెందిన పలు అంశాలపై చర్చించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నాలుగు మండలాల టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన శ్రేణులు పాల్గొన్నాయి.

కార్తీక మాసోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం కోటవీధిలో స్వయంభువుగా వెలసిన భోగలింగేశ్వరస్వామి కార్తీకమాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతినిధులను సూచించారు. కార్తీక మాసోత్సవాల గోడపత్రికను ఆయన తన గృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శరన్నవరాత్రి వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల రాము, వాసుపల్లి తాతయ్యలు, కొణతాల త్రినాథరావు, మెలిపాక ఈశ్వరావు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి బూత్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులతో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజక వర్గ కన్వీనర్ సన్యాసి నాయుడు, పొనగంటి అప్పారావు, శ్రీరామ మూర్తి, నాగేశ్వరరావు, పాకలపాటి రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి సమాజ నిర్దేశకులు

- ఘనంగా బాలల దినోత్సవం
- గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): నేటి బాలలే రేపటి సమాజ నిర్దేశకులని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. జంపపాలెం హైస్కూల్‌లో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి పాఠశాల ఆవరణలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు సేనాపతి రాము, శ్రీరాములు, హెచ్‌ఎం శాస్త్రి, స్కూల్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలో గల వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, సర్పంచ్ గారా ఉష శ్రీ, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతి ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు బాబూరావు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, నామవరం పీఏసీఎస్ చైర్మన్ లత, గ్రంథాలయాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం (అనకాపల్లి): గొర్లె ధర్మవరంలో మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు, వికలాంగులకు బియ్యం పంపిణీ చేశారు. లోటస్ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. గొర్లె నాగేశ్వరరావు, అప్పలరాజు పాల్గొన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి ఎంఈవో రోజా రమణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కూండ్రపు విమల నాయుడు, గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్ పాల్గొన్నారు.



జంపపాలెం హైస్కూల్లో నెహ్రూ జయంతి

కోటవురట్ల : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా మంచి నడవడిక అలవడుతుందని మాజీ సీడీసీ చైర్మన్ ఆర్.ఎస్. రాంబాబురాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవం, జాతీయ గ్రంథాలయ వారోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు ఆటలపోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పి.కొండబాబు, గ్రంథాలయాధికారి విజయ పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ప్రారంభించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

యలమంచిలి : పేట బయ్యవరం పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేశ నాయకుల చిత్రపటాలకు విద్యార్థులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు రూ. 4 వేలు విలువ చేసే పుస్తకాలు, పెన్నులు పాఠశాలకు వితరణగా అందజేశారు. పెద గొల్లలపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో పుస్తకాలు,పెన్నులు, పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు బోగవిల్లి రాఘవ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నిర్మల పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ విద్యార్థులతో కలసి జాతీయ పతాకావిష్కరణ చేశారు. నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ అడారి పూరీ జగన్నాథం, ఉపాధ్యాయుడు వై.సత్యనారాయణ, ఏఐటీయూసీ కార్యదర్శి ఏసుదాసు, గ్రంథాలయాధికారి ఆనంద్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ప్రసంగిస్తున్న తోట నగేష్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి

నక్కపల్లి : విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను ఉపయోగించుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో కుంచం నరేష్ , చినదొడ్డిగల్లు లైబ్రేరియన్ కె. జనార్దన్ అన్నారు. మంగళవారం 67వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను వారు చినదొడ్డిగల్లు, పెదబోదిగల్లంలలో ప్రారంభించారు. గ్రంథాలయాల వద్ద పతాకావిష్కరణ చేసి, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాజయ్యపేట పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు మేడేటి శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్సిళ్లు, పెన్నులు, నోట్ పుస్తకా లు పంపిణీ చేశారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల లో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

రాంబిల్లి: బాలల దినోత్సవం సందర్భంగా రాంబిల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వేణుగోపాల్, స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ పలువురు ఉపాధ్యాయులు , విద్యార్థుళు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దిమిలిలో కొఠారు వినయ్, కె.రోషిత అల్లూరి సీతారామరాజు, భరతమాత వేషధారణలో అలరించారు. దిమిలి శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ బంగారు చిలుకు జాతీయ పతాకావిష్కరణ చేశారు. నెహ్రూ చిత్ర పటం వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. లైబ్రేరియన్ ఎస్.శకుంతల విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు.



గొర్లె ధర్మవరంలో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం



గొడిచర్లలో దివ్యాంగులకు ఆటల పోటీలు



పేట బయ్యవరంలో విద్యార్థులకు బహుమతులు



దిమిలిలో భరతమాత, అల్లూరి వేషధారణలో విద్యార్థులు

మునగపాక: విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లే అలవాటును అలవరచుకోవాలని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రంథాలయాధికారి రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు తులసీరావు, ఉపాధ్యాయులు శివకోటి దుర్గా ప్రసాద్, జగదీష్, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీఆర్పీ అచ్యుతకృష్ణ పాల్గొన్నారు. గణపర్తి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనరసమ్మ అధ్యక్షతన సర్పంచ్ చదరం నాయుడు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి ఆకాంక్షించారు. ఒంపోలు మాజీ సర్పంచ్ సింహాద్రినాయుడు జ్ఞాపకార్థం అతని కుమారుడు శ్రీరామమూర్తి స్థానిక ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బాక్సులు, స్టీల్ బాక్సులు, పెన్నులను అందజేశారు. సర్పంచ్ సూరిబాబు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నకే పట్టం కడదాం

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కడదామని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఎస్సీ కాలనీ సచివాలయానికి సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనకు, నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడా గమనించాలని కోరారు. మాకు ఓటు వేసినందుకు మీ రుణం తీర్చుకుంటున్నామన్నారు. వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి పింఛను మొత్తాన్ని రూ.3 వేలు చేసి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వంద శాతం హామీలను అమలు చేస్తామన్నారు. ఒక్క ఎస్సీ కాలనీ సచివాలయం పరిధిలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.20 కోట్లు లబ్ధి చేకూర్చినట్టు తెలిపారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే ప్రస్తుతం ఇస్తున్న సంక్షేమ పథకాలన్నీ చక్కగా అమలౌతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. అమ్మఒడి, చేయూత, ఆసరా వంటి పథకాలు ఎంతమందికి అందుతున్నాయో చేతులెత్తి చెప్పాలని ఆమె లబ్ధిదారులను కోరగా సమావేశానికి హాజరైన వారిలో 90 శాతం మంది చేతులెత్తి తమకు పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని, ఈ ప్రభుత్వంలో మంచి జరిగిందో లేదో మనస్సాక్షిగా గుర్తించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, కాకివాని వీధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సమావేశానికి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎర్రయ్యదొర అధ్యక్షత వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు కౌన్సిలర్లు కర్రి శివ, రాపేటి రాజేష్, నర్సింహమూర్తి, షేక్ బీబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ,పిల్లా త్రినాథ్, చిరంజీవి, అచ్యుతరావు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, డీఈఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అన్నాజీ పాల్గొన్నారు.



ఎస్సీకాలనీ సచివాలయం పరిధిలో సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ఉన్న డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

చంద్రబాబు వస్తే రాష్ట్రం అధోగతే

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

నక్కపల్లి : 2024లో జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కాకపోతే అధోగతి పాలవ్వాల్సి వస్తుందని, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ నిలిచిపోతాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం ఉద్దండపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన పథకాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు సుమారు రూ.6 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. రూ.3వేల కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ ఫైబర్‌నెట్ కుంభకోణం చేసి నిధులను స్వాహా చేశారు. సీఐడీ దర్యాప్తు చేసి కేసులు నమోదు చేస్తే కోర్టు రిమాండ్ విధించడంతో చంద్రబాబు జైలుకు వెళ్లారన్నారు. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని ప్రచారం చేస్తూ సానుభూతితో అధికారం కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, సర్పంచ్ వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పాపారావు, ఎంపీటీసీ బచ్చలరాజు చంద్రరావు పాల్గొన్నారు.



ఉద్దండపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం: అమలవుతున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా.. రాష్ట్రానికి జగనే మళ్లీ సీఎం కావాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. చినగుమ్ములూరు గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే...అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అమలు అయిన సంక్షేమ పథకాలు వివరాలు పొందు పరచిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనరసింహ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు ప్రసాద్, ఎంపీడీవో రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికీ సంక్షేమ లబ్ధి

యలమంచిలి : రాష్ట్రంలో ప్రతి పేద వాడికి సంక్షేమ లబ్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఏపీకి మళ్లీ సీఎంగా జగనే ఎందుకు కావాలంటే... అనే కార్యక్రమంలో భాగంగా రేగుపాలెం గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ గోవింద్ ప్రజాప్రతినిధులు అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఏముఖ్యమంత్రి చేయలేనంత విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పరిపాలన జరిగిందని, అందువల్ల మళ్లీ రానున్న ఎన్నికల్లో జగనన్నకు సీఎంగా పట్టం కట్టాలన్నారు. వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఎంపీడీవో అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, సచివాలయ కన్వీనర్ వాసు, సర్పంచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.



రేగుపాలెంలో ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోవింద్, ప్రజాప్రతినిధులు

ఘనంగా కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం

మునగపాక : మండల వ్యాప్తంగా మంగళవారం కార్తీకమాసం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి గ్రామాల్లోని దేవాలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. వాడ్రాపల్లిలోని శివాలయం, సిరసపల్లి, నాగులాపల్లి, గణపర్తి గ్రామాల్లోని శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు. వెంకటాపురంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిత్యాన్నదానం కార్యక్రమాన్ని సర్పంచ్ తాతాజీ, ఉప సర్పంచ్ సాయివజ్రం ప్రారంభించారు. ఎంపీటీసీ వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దుప్పుతూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'



దుప్పుతూరులో ప్రచార పత్రాల పంపిణీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి స్థానిక సర్పంచ్ దేశంశెట్టి శంకర్‌రావు ప్రచారం చేశారు. దీనికి సంబంధించి కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన బుజ్జి, కో-ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్,అచ్యుతాపురం సర్పంచ్ విమలనాయుడు పాల్గొన్నారు.

పాటిపల్లిలో నేడు

మునగపాక : మండలంలోని పాటిపల్లి సచివాలయం పరిధిలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం వద్ద నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధితో పాటు ఎంతమంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి సాయం అందిందనే వివరాలపై సమావేశం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మన్మథరావు కోరారు.

రూ.85 లక్షలతో కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణ

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కన్నబాబురాజు



చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఇక్కడ ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మంజూరు చేసిన రూ.85 లక్షల నిధులతో చేపడుతున్న పనులను గురించి మున్సిపల్ ఇంజనీర్ కె.వీరయ్యను అడిగి తెలుసుకున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతోపాటు గ్రీనరీ పెంపుదల, విద్యుద్దీపాల ఏర్పాటు గురించి ఆరా తీశారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని సూచించారు. వీలైనంత త్వరగా చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే కావాలి..

కోటవురట్ల: సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు అన్నారు. అన్నవరంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అన్నవరంలో జరిగిన అభివృద్ధి, లబ్ధిదారులకు కలిగిన లబ్ధిని వివరిస్తూ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీతారామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలన దేశానికే ఆదర్శం అన్నారు. చాలా రాష్ట్రాలు ఏపీలోని సంక్షేమ పథకాలను కాపీ కొడుతున్నాయని, ముఖ్యమంత్రి జగన్ పాలనను అనుసరిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌నే మళ్లీ సీఎంను చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఈవోపీఆర్డీ భానోజీరావు, సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, పార్టీ నాయకులు రాజుల నాయుడు, బాబ్జీ, యర్రంనాయుడు పాల్గొన్నారు.



అన్నవరంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదల పెన్నిధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పాయకరావుపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధి అని, రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. రాజవరం గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏమీ అమలు చేయలేదన్నారు. చిక్కాల రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో స్వయంగా ప్రజలు కష్టాలను అడిగి తెలుసుకుని, సమస్యలనే ఎన్నికల అజెండాగా చేసుకున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ అమ్మాజీ, ఎంపీటీసీ మరిణమ్మ, పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యజ్జల సత్యనారాయణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేష్ ఖన్నా, ఎం.ఎస్.పేట, మంగవరం, సత్యవరం,గోపాలపట్నం, పాల్మన్‌పేట సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, వంగలపూడి సరస్వతీ రామారావు, నకిలేటి రాము, పన్నీరు బాబ్జి, కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంపీటీసీలు యాగదాసు శేఖర్, కొంతం నరేష్, నాయకులు రమణ, లక్ష్మణరావు, మండల యూత్ అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు లోవకుమార్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చిక్కాల రామారావు

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలి

మునగపాక : రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటాపురంలో ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన ఫ్లెక్సీని ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ సుందరపు తాతాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, ఎంపీటీసీ వీరునాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ లిల్లి, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మోహిని పాల్గొన్నారు.



వెంకటాపురంలో ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి

ఎమ్మెల్సీ రఘురాజుకు సాదర స్వాగతం



ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



లక్కవరంలో పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ గోవింద్, వైఎస్సార్‌సీపీ నేతలు

ఎస్.రాయవరం : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరళా సీఎం కావాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన జయహో జగనన్న పాదయాత్ర మంగళవారం ఎస్.రాయవరం మండలం మీదుగా సాగింది. పి.ధర్మవరం గ్రామంలో రఘురాజుకి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సాదర స్వాగతం పలికారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో పలు గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజి, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ లోవలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా రఘురాజుకు ఘన స్వాగతం పలికారు. అడ్డురోడ్డు మీదుగా పాదయాత్ర సాగి నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలో రాత్రి బస వద్దకు చేరుకున్నారు. అనకాపల్లి నూకాంబిక ట్రస్ట్ మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మధువర్మ, వెదుళ్ల బంగారి, గొంతిన సత్యనారాయణ, అద్దేపల్లి బొజ్జన్న, పుట్టా సుధాకర్, గరగా శ్రీను పాల్గొన్నారు.

లక్కవరంలో నేతల సంఘీభావం

యలమంచిలి : రాష్ట్రంలో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ రఘురాజు తిరుపతికి కాలినడకన చేస్తున్న పాదయాత్ర మంగళవారం యలమంచిలి మండలం లక్కవరం గ్రామంలోకి చేరుకుంది. ఈ పాదయాత్రకు సంఘీభావంగా ఎంపీపీ బోదెపు గోవింద్, మండల వైఎస్సార్‌సీపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పార్టీ నాయకులు లక్కవరంలో రఘురాజును కలసి సంఘీభావం తెలిపారు.